క్లుప్తంగా

బహిరంగ సభను విజయవంతం చేయాలి

తుక్కుగూడ: కృష్ణా నీటి అంశంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య కోరారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బహిరంగ సభకు మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

దాడులు సరి కావు

హుడాకాంప్లెక్స్: అచ్చంపేటలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని సరూర్‌నగర్ ఆర్య వైశ్య సంఘం మీడియా కమిటీ చైర్మన్ కాకొళ్ల రాజుగుప్తా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగితే చూడలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. సమాజంలో అన్ని వర్గాలతో పాటు సమానంగా రాజకీయాల్లో రాణించే హక్కు తమకు ఉందన్నారు. రైతులకు అన్యాయం జరిగితే అధికారులకు ఫిర్యాదులు చేయాలి కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సరి కాదన్నారు. గిట్టుబాటు ధర తదితర వాటిలో సమస్యలు ఉంటే ప్రభుత్వానికి తెలపాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా అమరేందర్



కందుకూరు: ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నార్త్ జోన్ కన్వీనర్‌గా మండల పరిధిలో బేగంపేటకు చెందిన గుండ్రపల్లి అమరేందర్ నియమితులైయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బరిగెల దుర్గాప్రసాద్ సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. కోకన్వీనర్లుగా నాగార్జున, శేఖర్‌లను నియమించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అమరేందర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రవణ్, శ్రీను, రాము, శ్రీకాంత్, మహిపాల్, కృష్ణ, మల్లేష్, ప్రదీప్, రంజిత్, స్వామి, వంశీ, అశోక్, ఆంజనేయులు, భాస్కర్, చక్రపాణి పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డిని పరామర్శించిన తీగల



దయాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త, బీఆర్ఎస్ నాయకుడు పారుపల్లి దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హుడాకాలనీలోని దయాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రజాసేవతో పాటు ఆరోగ్యాన్ని కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు బేర బాలకిషన్, అరవింద్‌కుమార్, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌గుప్తా, సుదర్శన్ ముదిరాజ్, రిషి తదితరులున్నారు.

కరాటే పోటీలో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

బడంగ్‌పేట్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే 3వ అంతర్జాతీయ చాంపియన్‌షిప్-24 పోటీల్లో బాలాపూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్-10, అండర్-12, అండర్-14 బాల బాలికల విభాగంలో కటాస్, స్పైరింగ్‌లో పాల్గొని బంగారు పతకాలు-7, వెండి పతకాలు-5, కాంస్య పతకాలు-2 సాధించారు. నిర్వాహకులు సత్తాచాటిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలతో పాటు, కరాటే చాంపియన్ షిప్ ట్రోఫీలను అందజేశారు. సోమవారం పాఠశాలలో యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎంఎం.షరీఫ్, ప్రెసిడెంట్ పి.జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇ.శివకుమార్, అంజనాదేవి, ప్రిన్సిపాల్ శైలజ, కరాటే మాస్టర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహజ్యోతి అమలుకు కసరత్తు

పేదల సంక్షేమమే లక్ష్యంగా ఆరు గ్యారంటీలు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక అమలుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద వైద్య సాయం పెంపు కల్పించింది. ప్రస్తుతం గృహజ్యోతి పథకం కింద విద్యుత్ వినియోగం 200 యూనిట్ల కంటే తక్కువ ఉన్న వినియోగదారులకు ఉచితంగా ఇవ్వనుంది.

- మండలంలో 24,410 గృహ విద్యుత్ కనెక్షన్లు
- 6,200 మంది వినియోగదారుల వివరాల సేకరణ



వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు వడివడిగా ముందుకు కదులుతోంది. అందులో భాగంగా గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ శాఖ కసరత్తు ప్రారంభించింది. గృహ విద్యుత్ కనెక్షన్ మీటర్లు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి సర్వీసు నంబర్ల ఆధారంగా యాజమాని రేషన్ కార్డు, ఆధార్, ఫోన్ నంబర్లు సేకరించేందుకు లైన్‌మెన్లను సమాయత్తం చేశారు. మహేశ్వరం మండలంలోని మొత్తం 34,841 విద్యుత్ కనెక్షన్లు ఉండగా అందులో 24,410 గృహ వినియోగ(డొమెస్టిక్) కనెక్షన్లు ఉన్నాయి. మండలంలోని 17,790 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. గృహజ్యోతి పథకానికి తెల్ల రేషన్ కార్డు ఉన్నవారే అర్హులవుతారు. ఇందులో 70 శాతం వరకు విద్యుత్ కనెక్షన్లు పేద, మధ్య తరగతి కుటుంబాలవే ఉంటాయి. వీరంతా సగటున ప్రతి నెలా 200 యూనిట్లలోపే విద్యుత్ ఉపయోగిస్తుంటారని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికి గృహజ్యోతి పథకం వర్తింపజేయనున్నారు.

ఇంటింటికీ విద్యుత్ సిబ్బంది

మండలంలోని గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ అధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టి వివరాలు సేకరిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న లైన్‌మెన్‌లు, బిల్లింగ్ సిబ్బంది ఐఆర్ మిషన్లతో ఇంటింటికి వెళ్తున్నారు. విద్యుత్ మీటర్ ఎవరి పేరు మీద ఉందో తెలుసుకొని వారి ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, ఫోన్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్ ఐఆర్ మిషన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రేషన్‌కార్డు లేకపోతే ఆ కాలమ్‌ను వదిలేస్తున్నారు. ఇళ్లలో అద్దెకు ఉండేవారి వివరాలు కూడా సిబ్బంది సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులు లైన్‌మెన్లు, బిల్లింగ్, ఇతర సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పనిలో పనిగా జనవరి నెల బిల్లులు, పెండింగ్ బిల్లులను విద్యుత్ సిబ్బంది వసూలు చేయడంతో పాటు వివరాలు కూడా సేకరిస్తున్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు విడుదల చేయగానే గృహజ్యోతి పథకాన్ని అమలులోకి తేనున్నారు. రోజు వారి వివరాల సేకరణను విద్యుత్ ఉన్నతాధికారులు తెలుసుకుంటున్నారు.

ఆందోళన వద్దు



గృహజ్యోతి పథకం అమలుకు ప్రభుత్వ ఆదేశానుసారం అర్హుల నుంచి వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు 6,200 దరఖాస్తుల వివరాలను సేకరించాం. ఇంట్లో అద్దెకు ఉన్నవారు స్థానికులైతే వారు కూడా అర్హులవుతారు. వివరాలు సేకరించడానికి మా సిబ్బంది వచ్చినప్పుడు ఇంట్లో లేకపోతే మిస్ అయ్యామని ఆందోళన చెందకుండా మండల కేంద్రంలో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వవచ్చు.

– చక్రపాణి, విద్యుత్ ఏఈ, మహేశ్వరం

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

చైర్మన్ మధుమోహన్



మాట్లాడుతున్న చైర్మన్ మధుమోహన్

తుక్కుగూడ: అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధు మోహన్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో 2024-25 వార్షిక బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.25.16 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించామన్నారు. ఇందులో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.4.94 కోట్లు, సిబ్బంది జీతభత్యాలకు రూ.3.70 కోట్లు, గ్రీన్ బడ్జెట్ రూ.1.79 కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.1.48 కోట్లు, పరిపాలన నిర్వహణకు రూ.82 లక్షలు, మిగులు బడ్జెట్ కింద రూ.2.54 కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ వెంకటేశ్, ఏఈఈ భార్గవ్‌రెడ్డి, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి, అనిత, పద్మ, తేజస్విని, భావన, విలాస్, రాజు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ని వినియోగించుకోవాలి



పులిమామిడిలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకం అమలుకు సోమవారం మండల పరిధిలోని పులిమామిడిలో విద్యుత్ సిబ్బంది లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. ఆ గ్రామ కాంగ్రెస్ బూత్ అధ్యక్షుడు బుక్క పాండురంగారెడ్డి వారితో పాటు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బందికి సరైన పత్రాలు అందించి అర్హులైన ప్రతి ఒక్కరూ గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా వార్షికోత్సవం

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడలో శ్రీ శివరామాజంనేయస్వామి దేవాలయంలో సోమవారం వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకం, శివుడికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం హోమాలు చేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ దంపతులు ఏనుగు శ్రావణి, జంగారెడ్డి కల్యాణాన్ని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ మాజీ చైర్మన్లు దేవేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మనోహర్‌గుప్తా, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, భూమిరెడ్డి, చెన్నారెడ్డి, అంజిరెడ్డి, అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, మోహన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, వెంకటేష్, గోవర్ధన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సునీత,శేఖర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు



పహాడీషరీఫ్: పార్టీలో చేరిన నేతలతో కేఎల్లార్

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం మహేశ్వరం పీఏసీఎస్ డైరక్టర్ చెట్కూరి శ్రీధర్‌రెడ్డి తన అనుచరులతో బీఆర్ఎస్ పార్టీని వీడి కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. పార్టీ నేతలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రభుత్వ పథకాలు వారికి చేరేలా చూడాలన్నారు. పార్టీలో చేరిన వారిలో హరికృష్ణరెడ్డి, నవీన్, గణేశ్, బాబయ్య, సుబ్బు, రంగనాయకులు ఉన్నా రు. కార్యక్రమంలో పాండు రంగారెడ్డి, బాలరాజ్, రాజు కుమార్, రంజిత్, అర్జున్, సుధాకర్ పాల్గొన్నారు.

చేరికలు

పహాడీషరీఫ్: సమస్యలకు నిలయంగా మారిన జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శ్రీరాం కాలనీకి చెందిన శాంతమ్మ, స్వామిలకు సోమవారం జల్‌పల్లి సీనియర్ నాయకుడు షేక్ జహంగీర్ ఆధ్వర్యంలో కేఎల్లార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

పోటీ ప్రపంచానికి తగినట్లు విద్య



క్రీడో అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

మీర్‌పేట: క్రీడో ప్రయోగశాలలో విద్యనభ్యసించడం ద్వారా ప్రావీణ్యం గల పౌరులుగా తయారవుతారని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప అన్నారు. సోమవారం మీర్‌పేట జిల్లెలగూడలోని లార్డ్స్ పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులు చదివే ‘క్రీడో’ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచం, పెరుగుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సరిత, క్రీడో ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో) టమోటా లోకల్ రూ.19, వంకాయ రూ.15, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ 45, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 23, క్యారెట్ 23. దొండ 40, ఆలుగడ్డ 24, ఉల్లి 19, గోకర 45, దోస 21, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటి 09, చిక్కుడు 40, అర్వి 55, మునగ 65, చిలగడదుంప 60, బీట్‌రూట్ 23, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ రూ. 55గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో టమాటా రూ.19, వంకాయ 15, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 28, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండకాయ 28-40, చిక్కుడు 23-40, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 55, ఆలుగడ్డ 19-26, దోసకాయ 21, సొరకాయ 11, పొట్లకాయ 13, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 55 గా ఉన్నాయి.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లోని 15వ డివిజన్‌లో బీటీ రోడ్డు పనులను సోమవారం అధికారులతో కలిసి మేయర్ పారిజాతరెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లు పరిశీలించారు. ఆర్చిడ్ కాలనీలో గుంతలమయమైన రోడ్లతో కాలనీవాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాలనీవాసుల విన్నపం మేరకు బీటీ రోడ్డు మంజూరు చేయించి పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ చైర్మన్ అఫ్జల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి తరలిరావాలి




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, సేవాలాల్ సేన నాయకులు

కందుకూరు: మండలంలో ఈ నెల 15న నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సేవాలాల్ సేన నాయకులు సోమవారం మండల కేంద్రంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, సీఐ మక్బూల్‌జానీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాంరాథోడ్, ఉపాధ్యక్షుడు భీంలాల్‌పవార్ మాట్లాడుతూ.. జయంతి, శోభాయాత్రను విజయవంతం చేసేలా అన్ని తండాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని కోరారు. నాయకులు రాజునాయక్, బాలునాయక్, మాణిక్యంనాయక్, శ్రీనునాయక్, కృష్ణనాయక్, మోహన్‌నాయక్, రవినాయక్, భాస్కర్‌నాయక్, బన్సీలాల్‌నాయక్, హరిలాల్‌నాయక్, శంకర్‌నాయక్, జైపాల్‌నాయక్, శ్రీనునాయక్, రమేష్ నాయక్, భీమానాయక్, గోవర్ధన్‌నాయక్, కిరణ్‌నాయక్, రాజేశ్‌నాయక్, వంశీనాయక్, శ్రీకాంత్‌నాయక్, మునీశ్వర్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

టిప్పర్ ‘ఓనర్స్’ సమ్మె

అబ్దుల్లాపూర్‌మెట్: టిప్పర్లలలో అధిక లోడు రవాణా చేయడాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ నేటి (మంగళవారం) నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు టిప్పర్ లారీ యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి తెలిపారు. టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సద్దుపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ టిప్పర్లలలో అధిక లోడును రవాణా చేయడాన్ని తాము ఖండిస్తున్నామని తెలిపారు. అధిక లోడును అరికట్టడడంతో పాటు టిప్పర్లలో పాసింగ్ లోడును రవాణా చేయాలనే డిమాండ్‌తో 13 నుంచి 18వ తేదీ వరకు టిప్పర్ లారీల యజమానులందరం సమ్మె చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమ్మెకు అన్ని రకాల క్రషర్ల యజమానులు, డాంబర్‌ప్లాంట్ల యజమానులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టిప్పర్ల యజమానులు, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో దోహదం చేస్తుందని, పేదలకు ఇది ఒక వరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అల్తాఫ్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు కాలేయ వ్యాధితో భాధపడుతున్నాడు. ఆపరేషన్‌కు సరిపడ డబ్బు లేకపోవడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆయన కుటుంబసభ్యులు సంప్రదించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చికిత్స వివరాలతో ఎల్‌ఓసీకి బాధితులతో దరఖాస్తు చేయించారు. చికిత్స నిమిత్తం ఎల్‌ఓసీ కింద మంజూరైన రూ.1.50లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలలేమి!



పాఠశాలలో పెరిగిన పిచ్చి మొక్కలు



పేరుకుపోయిన వ్యర్థాలు

- అధ్వానంగా భూపేశ్‌గుప్తానగర్ ప్రాథమిక పాఠశాల
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని స్థానికుల ఆవేదన
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలోనిప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీసవసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ఓ వైపు, చెత్త కాగితాలు మరోవైపు దర్శనమిస్తున్నాయి.

ఆకతాయిలకు అడ్డాగా..

ఆకతాయిలు మద్యం తాగి పాఠశాల ఆవరణలోనే తాగిన మద్యం బీరు సీసాలను పారవేసి పోతున్నారని, ఈ పాఠశాల అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం..

ప్రభుత్వ పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నా.. అటు విద్యాశాఖ అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు, పాఠశాల గురించి పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. పాఠశాలలో ఆకతాయిలు మద్యం తాగి పాఠశాల ఆవరణలో మద్యం బాటిళ్లను వదిలేస్తున్నారు. పాఠశాల ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

– నారగోని శ్రీనివాస్‌యాదవ్,కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు